క్లుప్తంగా

ఎంపీ విజయసాయిరెడ్డిని కలిసిన జిల్లా కలెక్టర్



బాపట్ల టౌన్‌: రెండు రోజుల పర్యటనలో భాగంగా బాపట్ల జిల్లాకు వచ్చిన పార్లమెంట్ సభ్యుడు, వైఎస్సార్ సీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, బాపట్ల జిల్లా రీజినల్ కో- ఆర్డినేటర్ ఎం.విజయసాయిరెడ్డిని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా పట్టణంలోని కోనభవన్‌లో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

కౌలు రైతులకు పంటరుణాలు ఇవ్వాలి

రేపల్లె రూరల్‌: కౌలురైతులకు పంటరుణాలను ప్రభుత్వం అందించాలని సీపీఎం పట్టణ కార్యదర్శి సీహెచ్ మణిలాల్ అన్నారు. కౌలు రైతుల సమస్యలపై స్థానిక సీపీఎం కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రప్రభుత్వం కౌలురైతులకు పూర్తిగా గుర్తింపు కార్డులు అందజేయాలన్నారు. రుణాలు పొందేవిషయంలో బ్యాంకుల నుంచి ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరారు.

ఐలవరంలో తులసీదాస్ జయంతి



ఐలవరం(భట్టిప్రోలు): సమరసత సేవా ఫౌండేషన్ (ఎస్ఎస్ఎఫ్) భట్టిప్రోలు మండలం ఐలవరం నగర సంకీర్తన సంఘం ఆధ్వర్యంలో స్థానిక వేణుగోపాలస్వామి దేవస్థానంలో వేంచేసి ఉన్న ప్రసన్నాంజనేయ స్వామివద్ద పరమ రామ భక్తుడు తులసిదాస్ జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. స్వామివారికి అర్చకుడు దీవి రఘునాథ చక్రవర్తి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ భక్తితో సంస్కృతంలో వాల్మీకి రాసిన రామాయణాన్ని హిందీలో రామచరిత మానస్ పేరుతో రాశారన్నారు. ఈ సందర్భంగా స్థానిక భజన సమాజం భజన సంకీర్తన, 11 సార్లు హనుమాన్ ఛాలీసా పారాయణ చేశారు. వి.కోటేశ్వరరావు, కేబీవీ రమణ, ఎం.రంగారావు, కె.శివశంకరరావు సిద్ధాంతి, సుబ్రహ్మణ్యం, జిల్లా ధర్మ ప్రచారక్ జంజనం హేమ శంకరరావు పాల్గొన్నారు.

గ్రేస్ ఫౌండేషన్ ఆపన్నహస్తం

అద్దేపల్లి(భట్టిప్రోలు): భట్టిప్రోలు పంచాయతీ పరిధిలోని అద్దేపల్లికి చెందిన కనుకుర్తి ఉదయ కుమారి మరణించడతో గ్రామ పెద్దల ద్వారా సమాచారం తెలుసుకున్న గ్రేస్ ఫౌండేషన్ అధినేత కైతేపల్లి షాలేమ్ రాజు మట్టి ఖర్చుల నిమిత్తం రూ. 5వేలు ఆర్థికసాయాన్ని గురువారం అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రేస్ ఫౌండేషన్ ప్రచార కమిటీ కన్వీనర్ యన్నం సురేష్, గ్రామ పెద్దలు యడ్ల జయశీలరావు, దాసరి కిరణ్, కంభం సురేష్, పాల్గొన్నారు.

ఎలక్షన్ డీటీ బాధ్యతలు స్వీకారం



వేమూరు: ఎలక్షన్ డిప్యూటీ తహసీల్దార్‌గా శ్రీనివాసరావు బాధ్యతలు స్వీకరించారు. చుండూరు తహసీల్దారు కార్యాలయంలో డిప్యూటీ తహశీల్దారుగా పని చేస్తున్న శ్రీనివాసరావు బదిలీపై వేమూరు ఎలక్షన్ డిప్యూటీ తహసీల్దార్‌గా సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఎలక్షన్ డిప్యూటీ తహసీల్దారుగా పని చేసిన నాగారాజుకు తహశీల్దారుగా ప్రమోషన్ వచ్చింది. ఆయన స్థానంలో శ్రీనివాసరావు బాధ్యతలు చేపట్టారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

భట్టిప్రోలు: అనారోగ్యంతో బాధపడుతూ మద్యానికి బానిసై అప్పులు తీర్చలేక ఓ వ్యక్తి పురుగుల మందు తాగి చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన ఇది. పోలీసుల కథనం ప్రకారం కొల్లూరు మండలం దోనేపూడి గ్రామానికి చెందిన అరిగ ప్రసాద్ బుధవారం భట్టిప్రోలు మండలం వెల్లటూరు బ్రిడ్జి వద్ద పురుగుల మందు తాగాడు. చికిత్స పొందుతూ గుంటూరు జీజీహెచ్‌లో గురువారం మృతి చెందాడు. ఎస్ఐ అంబటి చంద్రశేఖర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ సీజ్

భట్టిప్రోలు: అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఎటువంటి రశీదులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు గురవారం దాడిచేసి ట్రాక్టర్‌ను పోలీసు స్టేషన్‌కు తరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు. అనుమతి లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పనుల నాణ్యతను పరిశీలించేందుకే తనిఖీలు

డ్వామా పీడీ శంకర్ నాయక్



సామాజిక తనిఖీ ప్రజా వేదికలో రికార్డులు పరిశీలిస్తున్న పీడీ శంకర్ నాయక్

కర్లపాలెం: ఉపాధిహామీ పనులలో నాణ్యతను పరిశీలించేందుకు సామాజిక తనిఖీలు దోహదపడతాయని డ్వామా పీడీ శంకర్‌నాయక్ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద గురువారం ఉపాధిహామీ పనుల సామాజిక తనిఖీల ప్రజావేదిక నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కర్లపాలెం మండల పరిధిలో జాబ్‌కార్డులున్న కుటుంబాలలోని వారందరికీ 100రోజుల పనిదినాలు కల్పించేందుకు తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. 2022-23 సంవత్సరానికి సుమారుగా రూ.4కోట్ల విలువైన పనులు జరిగాయని చెప్పారు. ఉపాధిహామీ పథకంలో గ్రామ సచివాలయాలు, వెల్‌నెస్ సెంటర్‌లు, రైతు భరోసా కేంద్రాలు, సీసీరోడ్లు నిర్మించటం జరిగిందన్నారు. ఈసంవత్సరం ఉపాధిహామీ పథకంలో 70శాతం మంది పనులు కల్పించామని అన్ని గ్రామాలలో పనులు కల్పించేందుకు కాలువలకు, చెరువులకు మరమ్మతులు చేయిస్తామని చెప్పారు. ఎంపీపీ యారం వనజ, విజిలెన్స్ ఆఫీసర్ శోభన్‌బాబు ఏపీడీ ఆర్.భవానీ, ఈవోపీఆర్డీ ఎలీషాబాబు, ఏపీఓ సుధాకర్‌రావు, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు ఉన్నారు.

విశ్వమానవుడు సంజీవదేవ్



సంజీవదేవ్

తెనాలి: సుప్రసిద్ధ రచయిత, చిత్రకారుడు, మనోవైజ్ఞాని, మానవతావాది డాక్టర్ సంజీవదేవ్ 25వ వర్ధంతిని పురస్కరించుకుని ఈనెల 19న ఆయన స్వస్థలమైన దుగ్గిరాల మండల గ్రామం తుమ్మపూడిలో 'ఎప్పటికీ..అందరికీ..సంజీవదేవ్' పుస్తకావిష్కరణ జరగనుంది. సంజీవదేవ్ నివాసం 'రసరేఖ' ప్రాంగణంలో జరిగే సభకు ప్రజాసాహితి సంపాదకుడు కొత్తపల్లి రవిబాబు అధ్యక్షత వహిస్తారు. ప్రసిద్ధ ఆర్థికవేత్త, ఎకనామిక్ అండ్ పొలిటికల్ వీక్లీ సంపాదకుడు ప్రొఫెసర్ ఎస్.మహేంద్రదేవ్ పుస్తకాన్ని ఆవిష్కరిస్తారు. పుస్తక రచయిత ప్రొఫెసర్ లలితానందప్రసాద్, ప్రొఫెసర్ మన్నవ సత్యనారాయణ, నండూరి రాజగోపాల్, ఎస్.ఎస్.ప్రసాద్ ప్రసంగిస్తారు. ఈ సందర్భంగా సంజీవదేవ్ గురించి...

సంజీవదేవ్ చరాచరుడు. హైస్కూలు దాటని చదువుతో ఇల్లు వదిలాడు. హిమవన్నగ సానువుల్లో విహరించాడు. అసామాన్యులకు ఆంతరంగికుడైనాడు. ఇల్లు చేరి, తుమ్మపూడిలో వేళ్లజొనిపి సహస్ర బాహువులతో వినువీధుల్లో సయ్యాటలాడాడు. లోగిలినుంచే మబ్బుల్నీ, తెరచాప పడవల్నీ చూస్తూ ఎంతగా ఆనందించేవారో..తనలో తాను జీవిస్తూ వివిధ సాహిత్యాలను, భావవాహినులను అధ్యయనం చేస్తూ గడుపుతుండే సంజీవదేవ్‌కు, అసిత్‌కుమార్ హల్దర్ తరచుగా ఉత్తరాలు రాస్తూ, రసజగత్తుకు స్ఫూర్తినీ, చైతన్యాన్నీ అందిస్తూ వచ్చారు. దిలీప్‌కుమార్ రాయ్ రచించిన 'అనామీ' అనే బెంగాలీ పుస్తకం సంజీవదేవ్‌పై చూపిన ప్రభావం, తల్లావఝుల శివశంకరశాస్త్రి గేయనాటికలోని కవితా శిల్పం ఆకర్షించింది. 'కళ-విజ్ఞానము' అనే తొలి వ్యాసం పురుడు పోసుకుంది.

నిరంతర సాహితీప్రవంతిగా...

అక్కడ్నుంచి ఆయన కలం నిరంతర సాహితీప్రవంతిగా మారింది. నీలాకాశంలో దండలా కదిలే కొంగలబారుని, సాయంసంధ్యంలో నీళ్లని చీల్చుకుంటూ అలసటగా సాగే తెరచాప పడవల్ని, మంచు తెరల్లోంచి కనిపించే దేవదారు వృక్షాన్ని, ఎండిన రెల్లు దుబ్బుల్ని మాటల్లో బొమ్మలు కట్టి చూపించి, వాటిలోని సౌందర్యాన్నీ, సురుచినీ తెలుగుజాతి కనుపాపలకు మప్పిన మహాస్రష్టగా గుర్తింపును తెచ్చుకున్నారు. ఇందుకు చిన్ననాటనే మైమరపించిన హిమాలయాలు, ప్రఖ్యాత చిత్రకారులు నికొలస్ రోరిక్, హసిత్‌కుమార్ హల్దర్ సాంగత్యం తోడ్పడ్డాయి. నాలుగు పదుల వయసులో కుంచెను పట్టిన సంజీవదేవ్, చిత్రకళలోనూ ప్రత్యేకతను చాటారు. రూపం నిమిత్తమాత్రంగా, రంగు ప్రధానంగా వర్ణరూప చిత్రణ తీరు భావానుబంధంగా ఉంటుంది. మూడున్నర దశాబ్దాలకు పైగా చిత్రకళా జగత్తులో రూపరచన, అంతకుమించి రంగుల రచనలు చేశారాయన. ఆయన ఎవరివద్ద శిక్షణ తీసుకోలేదు. సాహిత్యంలోనూ, చిత్రకళలోనూ ఔన్నత్యాన్ని అందుకోవటానికి ఆయన జీవనగమనమే కారణమైంది.

రసాత్మక దృష్టితో నిరంతర ఆశావహ దృక్పథంతో జీవించిన విశ్వమానవుడు సంజీవదేవ్. సౌందర్యారాధనలో దివ్యత్వమో, దైవత్వమో ఉందని నమ్మేవారికి సంజీవదేవ్ ఆస్తికుడు. నమ్మనివారికి నాస్తికుడు. కులమతవర్గ బేధాలు తెలియవు. మంచీచెడుల మధ్య అగడ్తలు, అగాథాలు అధిగమించలేనివి కావనేవారు. సంజీవదేవ్ రచనలకు విశ్వమానవత, స్వేచ్ఛ, రసాస్వాదన అనే తాత్విక భూమిక ఉందని అంటారు చొదరి జంపాల. కొత్తతరం పాఠకులు ఆయన తాత్విక, కళాత్మక దృక్పథాలను తెలుసుకోవాల్సిన అవసరం ఉందంటారు. సంజీవదేవ్ సాంగత్యాన్ని, సాన్నిహిత్యాన్ని అనుభవించి, ఆయన రచనలను విస్తృతంగా అధ్యయనం చేసిన లలితానంద ప్రసాద్, తాజా పుస్తకం, ఆ విశ్వమానవుడి బహుముఖ ప్రతిభ, రసజీవన దృక్పథం, విశ్వమానవ చింతన, తాత్విక ప్రతిపాదనలను మనకు పరిచయం చేస్తుందని అంటారు.

మెరుగుపడుతున్న కానిస్టేబుల్ ఆరోగ్యం

మరోసారి పరామర్శించిన జిల్లా ఎస్పీ



చికిత్స పొందుతున్న కానిస్టేబుల్ రమేష్‌బాబుతో మాట్లాడుతున్న ఎస్పీ ఆరిఫ్ హాఫీజ్

నగరంపాలెం: దేవస్థానంలో దొంగతనానికి పాల్పడిన దుండుగల్ని పట్టుకునే ప్రయత్నంలో గాయాలై చికిత్స పొందుతున్న కానిస్టేబుల్ ఆరోగ్య పరిస్థితి క్రమేణా మెరుగుపడుతోంది. ఈనెల 5న తెనాలి వైకుంఠపురం దేవస్థానంలో దొంగల్ని పట్టుకునే క్రమంలో ఒకడు తెనాలి ఒకటో పట్టణ పోలీస్‌స్టేషన్ కానిస్టేబుల్ వై.రమేష్‌బాబును నెట్టడంతో పైనుంచి కిందపడి గాయాలయ్యాయి. గాయపడిన అతన్ని మెరుగైన వైద్యసేవలు నిమిత్తం గుంటూరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. ఈ క్రమంలో చికిత్స పొందుతున్న అతని ఆరోగ్య పరిస్థితిపై రాష్ట్ర డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి గుంటూరు రేంజ్ అధికారులతో మాట్లాడారు. కానిస్టేబుల్ ధైర్యసాహసాల్ని ప్రశంసిస్తూ, మెరుగైన చికిత్స అందించాలని ఆదేశించారు. దీంతో గుంటూరు రేంజ్ ఐజీ జి.పాల్‌రాజ్ అత్యవసర చికిత్స ఖర్చుల నిమిత్తం రూ.50 వేలను గుంటూరు జిల్లా పోలీస్ వెల్ఫేర్ నిధి నుంచి తక్షణ సాయంగా అందజేశారు. తెనాలి ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ కూడా కానిస్టేబుల్‌ని పరామర్శించి, ఆర్థిక సహాయం అందించారు. ఇక గుంటూరు జిల్లా ఎస్పీ కె.ఆరిఫ్ హాఫీజ్ పలుమార్లు ఆస్పత్రికి వచ్చారు. గురువారం మరలా ఆసుపత్రికి చేరుకుని పరామర్శించారు. చికిత్స పొందుతున్న కానిస్టేబుల్‌తో మాట్లాడారు. ఎప్పటికప్పుడు వైద్యులతో మాట్లాడి, మెరుగైన చికిత్స అందించడం వల్లే త్వరగా కోలుకున్నానని కానిస్టేబుల్, అతని కుటుంబ సభ్యులు జిల్లా ఎస్పీకి కృతజ్ఞతలు చెప్పారు. అనంతరం ఆసుపత్రి వైద్యుల్ని ఎస్పీ అభినందించారు. ఇంకా మెరుగైన వైద్యసేవలు అందించాలని సూచించారు. ఎస్పీ వెంట గుంటూరు పశ్చిమ డీఎస్పీ ఉమామహేశ్వరరెడ్డి, ఎస్‌బీ డీఎస్పీ సుభాష్, సీఐ బి.నరసింహారావు, నగరంపాలెం పీఎస్ సీఐ హైమారావు ఉన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

డాక్టర్ లక్ష్మీసుధ



ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా గర్భిణులకు పరీక్షలు చేస్తున్న డాక్టర్ లక్ష్మీసుధ

తూములూరు(కొల్లిపర): సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మండల వైద్యాధికారిణి డాక్టర్ చిక్కాల లక్ష్మీసుధ సూచించారు. గురువారం మండలంలోని తూములూరు గ్రామంలో సుగాలీపాలెంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. 104 వైద్య శిబిరంలో వైద్యాధికారి 50 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గర్భిణులు , బాలింతలు, అంగన్‌వాడీ కేంద్రంలో చిన్న పిల్లలకు మరియు బీపీ. షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులు అందజేశారు. గ్రామంలోని సుమారు 5 మంది దీర్ఘకాలిక రోగుల ఇళ్ల వద్దకే వెళ్లి రోగుల ఆరోగ్య పరిస్థితులు తెలుసుకుని మందులు అందజేసి సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షాల కారణంగా వచ్చు వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, తాగు నీరు గోరు వెచ్చగా ఉంచుకుని తాగాలని సూచించారు. కార్యక్రమంలో 104 సిబ్బంది పార్మసిస్ట్ బొమ్ము కోటిరెడ్డి, ఎంఎల్‌హెచ్ పి.చిలక భారతి, ఏఎన్ఎం యర్రమాల లలితకుమారి, హెల్త్ అసిస్టెంట్ డిఎస్ సుదర్శనశాస్త్రి , ఆషా కార్యకర్త ప్రమీల, అంగన్ వాడీ కార్యకర్తలు తదితరలు పాల్గొన్నారు.

గృహనిర్మాణాల పురోగతిపై సమీక్ష

భట్టిప్రోలు: జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాలు త్వరితగతిన పూర్తయ్యేలా చూడాలని మండల ప్రత్యేక అధికారి డాక్టర్ ఎం.హనుమంతరావు కోరారు. గురువారం భట్టిప్రోలు మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో గృహ నిర్మాణాల పురోగతి, లే-అవుట్ల పరిస్థితి, ఎన్ని గృహాల నిర్మాణాలు పూర్తయ్యాయి, యాక్షన్ ప్లాన్, ఐహెచ్‌హెచ్ఎల్ఎస్ గృహ నిర్మాణాల పురోగతి గూర్చి మండల స్థాయి అధికారులను అడిగి వివరాలను తెలుసుకున్నారు. తహసీల్దార్ డి.వెంకటేశ్వరరావు, ఏఓ జలజ, హౌసింగ్ ఏఈ రావూరి సౌమ్య, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

భట్టిప్రోలు: సబ్ స్టేషన్ పరిధిలో శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఇన్‌చార్జి ఏఈ ఏడుకొండలు గురువారం తెలిపారు.

విద్యార్థికి ఆర్థిక చేయూత

రేపల్లె: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ అత్యధిక మార్కులు 984 సాధించిన విద్యార్థి కె.అనీల్‌కుమార్‌కు కళాశాల ప్రిన్సిపాల్ పి.సుధాకరరావు ఆర్థిక చేయూతనందించారు. విద్యార్థి అనీల్‌కు తల్లిదండ్రులు లేనప్పటికీ ఏ మాత్రం నిరుత్సాహం చెందక ప్రభుత్వ కళాశాలలో చదివి, అత్యధిక మార్కులు సాధించి, నేడు అంతర్జాతీయంగా ప్రఖ్యాతిగాంచిన అమరావతి వీఐటీలో స్థానం సంపాదించాడన్నారు. అనీల్‌ను విద్యార్థులు ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలన్నారు. ఈ సందర్భంగా అనీల్‌కు స్థానిక కళాశాల ఆవరణలో గురువారం రూ.10వేల ఆర్థికసాయం అందజేశారు. తమ విద్యార్థి జీవితంలో స్థిరపడే వరకు అతని బాధ్యతను తీసుకుంటున్నట్లు తెలిపారు.



వేధింపులపై ఫిర్యాదు.. కేసు నమోదు

వేమూరు: తన అత్త, మామ, బావ తనను మానసికంగా వేధింపులకు గురిచేస్తున్నారని గ్రామానికి చెందిన పెరికల సత్యవతి ఫిర్యాదు చేసిందని ఎస్ఐ నాగరాజు తెలిపారు. వివరాలు మేరకు కృష్ణా జిల్లా మువ్వ మండలంలోని బార్లపూడి గ్రామానికి చెందిన నేలటూరు అనిల్, వేమూరు మండలంలోని వరహాపురం గ్రామానికి చెందిన పెరికల సత్యవతి ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. గ్రామంలో కొంతకాలం కాపురం చేశారు. ఇద్దరు వ్యక్తులు ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన వారైనా ఉప కులాలు వేర్వేరు కావడంతో తనను అత్త, మామ, బావలు కించపరిచేలా మాట్లాడుతూ, మానసికంగా ఇబ్బందులు గురి చేస్తున్నారని ఫిర్యాదు చేసిందని ఎస్ఐ నాగరాజు తెలిపారు. కేసు నమోదు చేసి, విచారణ చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

ట్రాక్టర్‌ను ఢీకొన్న కారు

ఎంపీడీఓకు తీవ్రగాయాలు



జంపని(వేమూరు): కారు, ట్రాక్టర్‌ను ఢీ కొన్న ఘటనలో వేమూరు ఎంపీడీఓ శ్రీనివాసరావుకు తీవ్ర గాయాలయ్యాయి. సేకరించిన సమాచారం ప్రకారం.. ఎంపీడీఓ శ్రీనివాసరావు కారులో మంగళగిరి నుంచి వేమూరులోని తన కార్యాలయానికి వస్తున్నాడు. ఈక్రమంలో జంపని గ్రామం వద్ద ముందు వెళ్లుతున్న ట్రాక్టర్‌ను ఢీ కొట్టాడు. ఎంపీడీఓకు గాయాలు కావడంతో 108 వాహనం ద్వారా వేమూరు సామాజిక ఆరోగ్య కేంద్రానికి తీసుకొచ్చారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్య కోసం తెనాలి ప్రభుత్వ వైద్య శాలకు 108 వాహనంలో పంపించారు. తెనాలి ప్రభుత్వం వైద్య శాలల్లో చికిత్స నిర్వహించారు. అక్కడ నుంచి కుటుంబ సభ్యులు మెరుగైన వైద్య కోసం విజయవాడ రమేష్ ఆసుపత్రికి తీసుకొని వెళ్లారు.

మండల సిబ్బందికి సన్మానం



సిబ్బందిని సన్మానించిన ఎంపీపీ లలిత కుమారి

భట్టిప్రోలు: స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకుని భట్టిప్రోలు మండలానికి సంబంధించిన వివిధ శాఖలకు చెందిన ముగ్గురు సిబ్బంది జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా చేతుల మీదుగా అవార్డులు అందుకున్న సందర్భంగా గురువారం ఘనంగా సన్మానించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎన్ఆర్ఈజీఎస్ టెక్నికల్ అసిస్టెంట్ సుధీర్, మండల సమాఖ్యలో సీసీగా పని చేస్తున్న రజని, బెస్ట్ ఫీల్డ్ అసిస్టెంట్ అవార్డును అందుకున్న నాగశ్రీ (పెదపులివర్రు)లను సన్మానించారు. కార్యక్రమంలో ఏఓ జలజ, ఈఓపీఆర్డీ ఊహారాణి, మండల సమాఖ్య ఏపీఎం గుడిమెట్ల శ్రీమన్నారాయణ, ఎంపీటీసీ సభ్యులు నీలా సాంబమ్మ, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

ఓటరు సర్వేకు సహకరించండి

- వాస్తవాలు పరిశీలించి, నమోదు చేయాలి
- బాపట్ల ఆర్డీఓ గంధం రవీందర్



ఓటర్ల వివరాలను పరిశీలిస్తున్న బాపట్ల ఆర్డీఓ గంధం రవీందర్

పిట్టలవానిపాలెం: ఓటర్ల సర్వే సక్రమంగా నిర్వహించాలని, ప్రజలు సైతం ఓటరు సర్వేకు సహకరించాలని బాపట్ల ఆర్డీఓ గంధం రవీందర్ తెలిపారు. మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో గురువారం వీఆర్వోలతో సమావేశం నిర్వహించారు. మండలంలో జరుగుతున్న ఓటర్ల సర్వే వివరాలను అడిగి తెలుసుకున్నారు. 2024 జనవరి 1 నాటికి 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరినీ ఓటర్లుగా నమోదు చేయాలని తెలిపారు. ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలు తెలుసుకోవాలని తెలిపారు. డోర్ నెంబర్ల వారీగా ఓటర్ల వివరాలు ఉండాలన్నారు. అదేవిధంగా ఒకే డోర్ నంబర్‌లో 10 ఓట్లు ఉన్నవారి వివరాలు నమోదు చేయడంతో పాటు వాస్తవాలను పరిశీలించాలని తెలిపారు. ఏవైనా సందేహాలుంటే ఉన్నతాధికారులను సంప్రదించాలని సూచించారు. తహసీల్దార్ డి.కవిత, ఇన్‌చార్జ్ ఆర్ఐ అమానుల్లాఖాన్, వీఆర్వోలు నాగజ్యోతి, భూసిమ్మ, వెంకట సుబ్బారావు, నాగాంజనేయులు, రమేష్ తదితరులు ఉన్నారు.

పాడిపశువుల పెంపకంలో మెలకువలు పాటించాలి

జిల్లా పశు సంవర్ధక శాఖాధికారి డాక్టర్ ఎం. హనుమంతరావు



పశు విజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ ఎం.హనుమంతరావు, పక్కన ప్రజాప్రతినిధులు

అద్దేపల్లి(భట్టిప్రోలు): పాడి పశువుల పెంపకంలో రైతులు మెలకువలు పాటించాలని జిల్లా పశు సంవర్ధక శాఖాధికారి డాక్టర్ ఎం.హనుమంతరావు తెలిపారు. భట్టిప్రోలు పంచాయతీ పరిధిలోని అద్దేపల్లి రైతు భరోసా కేంద్రంలో గురువారం పశువిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సంవత్సరానికి ఒక దూడ పుట్టాలంటే తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఇతర సూచనలను పశు పోషకులకు తెలియచేశారు. ఈ సందర్భంగా పశు పోషకులకు పశు బీమా పత్రాలను అందజేశారు. సర్పంచ్ దారా రవి కిరణ్మయి, ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి, జెడ్పీటీసీ తిరువీధుల ఉదయభాస్కరి, రేపల్లె సహాయ సంచాలకులు డాక్టర్ గోగినేని నరేంద్రబాబు, భట్టిప్రోలు పశు వైద్యాధికారిణి డాక్టర్ బొర్రా లక్ష్మి రంజిత, పశు పోషకులు పాల్గొన్నారు.

భవిష్యత్ తరాలకు స్వచ్ఛ ప్రకృతిని అందించాలి



వాల్‌పోస్టర్‌లను ఆవిష్కరిస్తున్న తహసీల్దార్ మల్లికార్జునరావు

రేపల్లె: ప్రకృతిని పరిరక్షిస్తూ స్వచ్ఛ వాయువులు కలిగిన వాతావరణాన్ని భవిష్యత్ తరాలకు అందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తహసీల్దార్ డి.మల్లికార్జునరావు అన్నారు. పట్టణ ఆదర్శవేదిక ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ప్రకృతిని పరిరక్షిద్దాం వాల్‌పోస్టర్‌లను గురువారం ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. పర్యావరణాన్ని పరిరక్షించేందుకు ప్రభుత్వం అనేక విధాలుగా కృషి చేస్తోందన్నారు. అదేవిధంగా ప్రజలు తమ ఇంటితో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచటంత పాటు మొక్కలు నాటి వాటిని సంరక్షించే బాధ్యతను చేపట్టాలన్నారు. అప్పుడే వాతావరణంలో ఆక్సిజన్ స్థాయి పెరగటంతో పాటు ఓజోన్‌పొరకు రక్షణ ఉంటుందన్నారు. ప్రకృతి పరిరక్షణలో భాగంగా ప్రజలను చైతన్యవంతుల్ని చేసేందుకు ఆదర్శ వేదిక సభ్యులు కృషి చేయటం అభినందనీయమన్నారు. పట్టణ ఆదర్శ వేదిక అధ్యక్షుడు యడ్లపల్లి కిషోర్‌బాబు, సభ్యులు కె.నటరాజ్, వి.కుమారి, కె.రాంబాబు, కె.కృష్ణమాచార్యులు పాల్గొన్నారు.

కొత్తవాడరేవులో వైఎస్సార్ మత్స్య సాగుబడి



మత్స్యకారులకు అవగాహన కల్పిస్తున్న మరియదాసు

బాపట్ల అర్బన్‌: బాపట్ల మండలంలోని కొత్తవాడ రేవు మత్స్యకార గ్రామంలో ఈ రోజు నాల్గవ విడత వైఎస్సార్ మత్స్య సాగుబడి కార్యక్రమాన్ని ఆ గ్రామ మత్స్య సహాయకులు గొరికపూడి మరియదాసు అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మరియదాసు మత్స్యకారులకు మత్స్య సాగుబడి ద్వారా సముద్రంలో వేటకు వెళ్లేముందు సమాచారాన్ని (సమృద్ధిగా చేపలు లభించు ప్రాంతం) తెలుసుకొని నావిగేషన్ పరికరాల ద్వారా త్వరగా చేరుకొని అధికంగా మత్స్య సంపదను వేట చేయడంతో పాటు సమయాన్ని మరియు డీజిల్ కూడా ఆదా చేసుకోవచ్చని తెలిపారు. ఆర్టిఫీషియల్ కోరల్ రీఫ్‌ను సముద్రంలో ఏర్పాటు చేయడం ద్వారా మత్స్య సంపదను పెంపొందించుకోవచ్చని తెలిపారు. మత్స్య సంపదను సంరక్షించుకోడంతో పాటు తీరం నుంచి తక్కువ దూరంలో సమృద్ధిగా చేపలు వేటాడేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. మత్స్యకార గ్రూపులకు రూ.35 లక్షల యూనిట్ ధరతో 100% సబ్సిడీతో ఇస్తున్నామన్నారు. మత్స్యకారులందరూ సద్వినియోగపరచుకొని, వారి జీవనోపాధిని మెరుగుపరుచుకోవాలని తెలిపారు.

డివైడర్ దిమ్మెలను ఢీకొట్టి నిలిచిపోయిన లారీ



ట్రాఫిక్‌తో ప్రజల ఇక్కట్లు

తెనాలిరూరల్‌: గుంటూరు వైపు నుంచి పట్టణంలోకి వస్తున్న ఓ లారీ పాత బస్టాండ్ వద్ద ఓవర్ బ్రిడ్జి డౌన్‌లో ప్రమాదానికి గురైంది. మాచర్ల నుంచి సిమెంటు లోడుతో వస్తున్న లారీ చెంచుపేట ఓవర్ బ్రిడ్జి నుంచి మారీసుపేట వైపు దిగే క్రమంలో బ్రిడ్జిడౌన్‌లో ఉన్న డివైడర్ దిమ్మెలను ఢీ కొట్టింది. మితిమీరిన వేగంతో ఢీ కొట్టడంతో డివైడర్ దిమ్మలు చెల్లాచెదురుగా పడిపోవడంతో పాటు లారీ ముందు భాగం ధ్వంసమైంది. ఆయిల్ ట్యాంకర్ లారీ నుంచి విడిపోయి నుజ్జునుజ్జయింది. దీంతో ట్యాంకర్ లో ఉన్న డీజిల్ మొత్తం రోడ్డు మీద పడిపోయింది. గురువారం తెల్లవారుజామున ఈ ఘటన జరిగింది. ఆ సమయంలో జన సంచారం లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పినట్టైంది. లారీ ముందు టైర్లు కూడా విరిగిపోయి పక్కకు తొలగిపోయాయి. విషయం తెలుసుకున్న కంట్రోల్ రూమ్ సీఐ వెంకటేశ్వరరావు, ట్రాఫిక్ ఎస్ఐ జోగి శ్రీనివాస్‌లు ఉదయం ఘటనా స్థలానికి వచ్చి లారీని అక్కడి నుంచి తీయించే ప్రయత్నం చేశారు. రెండు క్రేన్లు తెప్పించి వాటి సహాయంతో అతికష్టం మీద లారీని పక్కకు జరిపించారు. ప్రమాదానికి కారణమైన లారీని అక్కడి నుంచి తొలగించేందుకు ఉదయం 7 గంటల నుంచి 9 గంటల దాకా సమయం పట్టింది. ఈ సమయంలో వాహనాల రాకపోకలు నిలిపి వేయడం, లారీ తొలగించాక ఒకేసారి అన్ని వాహనాలు వదలడంతో ఎక్కడికక్కడ ట్రాఫిక్ నిలిచిపోయింది. ఈ సమయంలో స్కూల్లు, కాలేజీలకు వెళ్లే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. గుంటూరు వైపు కాలేజీలకు వెళ్లే వారంతా బస్సులు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. గుంటూరు వైపు నుంచి సిమెంటు లోడుతో వస్తున్న లారీ మితిమీరిన వేగంతో పాటు డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగానే ప్రమాదం జరిగిందని భావిస్తున్నారు. ఘటనకు సంబంధించిన వివరాలను ట్రాఫిక్ ఎస్ఐ జోగి శ్రీనివాస్ తెలియజేశారు.

వ్యక్తి అదృశ్యం

బాపట్లటౌన్‌: దుస్తులు ఐరన్ చేయించుకునేందుకు ఇంటి నుంచి బయటకు వచ్చిన వ్యక్తి అదృశ్యమైన సంఘటన మండలంలోని హైదరపేట గ్రామంలో చోటుచేసుకుంది. వివారాలు ఇలా ఉన్నాయి. హైదరపేటలోని హృషికేశవ్ ట్రిపుల్ ఐటీలో చదువుకున్నారు. బుధవారం మధ్యాహ్నం దుస్తులు ఐరన్ చేయించుకునేందుకు బాపట్ల వచ్చారని, అప్పటి నుంచి కనిపించడం లేదంటూ తల్లి దాసరి నాగపద్మావతి పోలీసులకు ఫిర్యాదుచేశారు. బాధితురాలి ఫిర్యాదుమేరకు రూరల్ ఎస్ఐ సింగయ్య కేసు నమోదుచేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.